క్లుప్తంగా

13న పెసర్ల విక్రయానికి వేలం

డిండి : 2022–23 సంవత్సరం యాసంగి సీజన్‌లో మండల కేంద్రం, చెర్కుపల్లి ప్రభుత్వ విత్తనోత్పత్తి కేంద్రాల్లో పండించిన పెసర్లకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశానుసారం ఈనెల గురువారం స్థానిక విత్తనోత్పత్తి కేంద్ర కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఏఓ రామలింగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిండిలో 45.20క్వింటాళ్లు, చెర్కుపల్లిలో 4క్వింటాళ్ల పెసర్లు అందుబాటులో ఉన్నాయని, వేలం పాటలో పాల్గొనే ఆసక్తి గల రైతులు ముందు గానే రూ.10 వేలు డిపాజిట్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి సబ్ స్టేషన్ 33/11కేవీ పరిధిలోని అడవిదేవులపల్లి, ముదిమాణిక్యం, సత్రశాల, ఉల్సాయిపాలెం, వీర్లపాలెం టౌన్, వీర్లపాలెం వ్యవసాయ, ఐడీసీ లిఫ్ట్ ఫీడర్ల కింద ఉన్న గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీను నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటనెన్స్ పనులు జరుగుతున్నందున విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక


గువ్వల వెంకటయ్య


ఎర్రబోతు పద్మ

మిర్యాలగూడ అర్బన్ : రైతు సంఘం మండల అధ్యక్షుడిగా గువ్వల వెంకటయ్య, కార్యదర్శిగా ఎర్రబోతు పద్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన రైతు సంఘం మం డల మహాసభలో ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులుదుర్కొంటున్న సమస్యలపై రైతులందరిని కలుపుకొని పోరాటాలు చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన రైతు సంఘం జిల్లా నాయకులు బంటు కటేశ్వర్లు, బిల్లా కనకయ్య లకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సంఘం సమాయ కార్యదర్శిగా కొమ్మరాజుల కృష్ణమ్మ, కోశాధికారిగా రామయ్యతో పాటు మరో నలుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన పీడీఎస్ బియ్యం

చందంపేట : నేరెడుగొమ్ము మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ సివిల్ సప్లయ్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం నేరెడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన ఆకుతోట దశరథ తన ఇంట్లో 31 సంచుల్లో అక్రమంగా నిల్వం ఉంచి ఉంచిన సుమారు 10.5 క్వింటాళ్ల పడీఎస్ బియ్యం, అలాగే శీల లక్ష్మమ్మ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 10.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం విక్రయించినా, కొనుగోలు చేసినా రవాణా చేసినా చట్టరీత్య చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

దేవాలయానికి విరాళం


దాత ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

హాలియా : స్థానిక పార్వతి సమేత జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమానికి గంటనాథం కొనుగోలు కోసం రూ.10,116 విరాళంగా హాలియాలోని జానకి రెడ్డి నగర్‌కు చెందిన నెర్మటి ప్రభాకర్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థంగా అందజేశారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డిని ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చెఎరుపల్లి ముత్యాలు, బందిలి సైదులు, పల్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి, నాగరాజు, నరేంద్రరావు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని హోలి క్రాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి పీహెచ్‌సీలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మహిళా ఉద్యోగులను, ఇటీవల నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా యోగా పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన సీహెచ్‌ఓ పద్మను శాలువాలతో సత్కరించారు.

శిథిలావస్థలో ఏఎమ్మార్పీ కార్యాలయం

- విరిగిన కిటికీలు, తలుపులు
- ఊడిపడేలా సీలింగ్
- మరుగుదొడ్లు లేక అవస్థలు
- పాముల భయంతో ఉద్యోగులు బిక్కుబిక్కు

గుర్రంపోడు : మండలకేంద్రంలోని ఏఎమ్మార్పీ డివిజన్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. 1984లో రేకులతో నిర్మించిన ఈ కార్యాలయంలో డివిజన్ 5 కార్యాలయంగా డివిజన్ ఈఈతోపాటు 30మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తారు. పది మంది మహిళా ఉద్యోగులు ఉన్నా మరుగుదొడ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలమయ్యాయి. గుర్రంపోడు, కనగల్, నల్లగొండ మండల్లాలోని లక్ష ఎకరాల ఆయకట్టు ఈ డివిజన్ కార్యాలయ పర్యవేక్షణలో ఉంటుంది. 18 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్యాంపు కాలనీలో ఆ శాఖ ఇచ్చిన స్థలంలో ఎంపీడీఓ, తహసీల్దార్, రైతు వేదిక పోలీసు స్టేషన్ లాంటి వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మితమైనా డివిజన్ కార్యాలయం మాత్రం పాత భవనంలోనే కొనసాగుతుంది. కార్యాలయ నిర్వహణ నిధులు లేక ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు.


గుర్రంపోడులోని ఏఎమ్మార్పీ డివిజన్ కార్యాలయం దుస్థితి

భయం, భయంగా ఉద్యోగుల విధులు

కార్యాలయం చుట్టూ శిథిలమైన క్వార్టర్లు, కంప చెట్లు ఉండటంతో విరిగిన కిటికీల గుండా పాములు చేరుతున్నాయి. దీంతో ఉద్యోగుల ఫైళ్లను తీయడానికి భయపడుతున్నారు. ఎక్కడ పాములు, తేళ్లు ఉన్నాయోనని చూసుకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. క్యాంపు కాలనీ అంతటా రోడ్లు కంకర తేలి ఉండటంతో ఇదే క్యాంపు కాలనీలోని సబ్ డివిజన్, ఇతర కార్యాలయాలకు వెళ్లడానికి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు మరుగుదొడ్లకుగాను కార్యాలయ ఉద్యోగులు తమ సొంత నిధులు సమకూర్చుకుని ప్రస్తుతానికి ఒక మరుగుదొడ్డి మరమ్మత్తు పనులు చేపడుతున్నారు.


శిథిలావస్థలో డివిజన్ కార్యాలయం

ప్రతిపాదనలు పంపించాం



డివిజన్ కార్యాలయ మరమ్మతులకు ఇటీవల రూ.14లక్షలతో మరమ్మతులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. కిటికీలు, తలుపులు కొత్తవి బిగించాల్సి ఉంది. శిథిలమైన రేకుల కప్పును అక్కడక్కడ మరమ్మతులు చేయాల్సి ఉంది. టాయ్‌లెట్ల నిర్మాణం అత్యవసరంగా చేపట్టాల్సి ఉంది.

– నెహ్రూనాయక్, ఈఈ, ఏఎమ్మార్పీ

మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐగా లక్ష్మయ్య

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐగా మల్లికంటి లక్ష్మయ్య సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న పిల్లి లోకేష్ కుమార్‌ను మల్టీజోన్–2 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయడంతో ఆయన స్థానంలో చౌటుప్పల్ ఎస్‌ఐగా పని చేస్తున్న లక్ష్మయ్య బదిలీపై మిర్యాలగూడకు వచ్చారు. లక్ష్మయ్య మొదటి పోస్టింగ్ నిజామాబాద్ 6వ టౌన్‌లో ఎస్‌ఐగా పని చేశారు. ఆ తరువాత నిజామాబాద్ నాల్గో టౌన్, బోధన్ టౌన్, రామన్నపేట, చౌటుప్పల్‌లో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

మిర్యాలగూడ : స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాస్‌శర్మ అన్నారు. ఎన్నికల కోడ్ ఉండడం వల్ల రెండు నెలల అనంతరం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం వల్ల తక్కువ ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, డీఎల్‌పీఓ రాఘవరావు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, సీడీపీఓలు మమత, చంద్రకళ, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం


దగ్ధమవుతున్న గుడిసె

కొండమల్లేపల్లి : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గుడిసె దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతచెట్టుతండా గ్రామపంచాయతీ సమీపంలో లతీఫ్ అనే వ్యక్తి గుడిసె వేసుకొని అందులో నివాసం ఉంటున్నాడు. అయితే ఇటీవల పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి సూర్యాపేటకు వెళ్లాడు. ఈ క్రమంలోనే గుడిసె దగ్ధం కావడం, ఆ సమయంలో అందులో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలదే. ప్రమాద సమయంలో సమీపంలో ఖాళీ బీరు సీసాలు ఉండడాన్ని బట్టి ఆకతాయిలు సిగరేట్ తాగి గుడిసెపై వేయడంతో ఈ ఘటన చోటు చేసుకొని ఉండొచ్చని లతీఫ్ అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. ఘటనలో సుమారు లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే ఈ ఘటనకు సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య

త్రిపురారం : గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య కోరారు. సోమవారం గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపి సూపరింటెండెంట్ దయాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన విధంగా కార్మికుల వేతనాలకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పడిశల ముత్తయ్య, తోట భద్రమ్మ, వలదాసు లచ్చయ్య, బాబుమోహన్, గోపాల్, గంపాల సైదులు, సాలమ్మ, మడుపు నాగయ్య, లచ్చయ్య, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చింతపల్లి : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్‌ఐ యాదయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తాలూకా జయేంద్ర రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చింతపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాలీబాల్ డివిజన్ స్థాయి టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్ నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. దేవరకొండ డివిజన్ సాయి వాలీబాల్ టోర్నమెంట్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అలీ, రాధా కిషన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లిలో క్రీడలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ యాదయ్య

సాండ్ టాక్సీ విధానం నిలిపివేయాలని వినతి


ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

దేవరకొండ : మండలంలోని తాటికోల్ వాగు నుంచి ఇసుక సాండ్‌టాక్సీ విధానాన్ని నిలిపివేయాలని కోరుతూ పలువురు సోమవారం దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ వాగు నుంచి ఇసుకను తరలించడం ద్వారా భూగర్భ జలాలు తగ్గి తాగునీరు, సాగునీరు కొరత ఏర్పడుతుందన్నారు. గ్రామానికి చెందిన రైతులు వాగునీటి ద్వారా వందల ఎకరాల్లో వ్యవసాయం సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు ఇందుకు సంబంధించిన అంశంపై పూర్తి స్థాయి సమాచారం సేకరించి ఇసుక ఆన్‌లైన్ నిలిపివేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గోపాల్, పబ్బు సైదులుగౌడ్, బాలనారి, గాంధీ, సయ్యద్, అంజయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని తడకమళ్ల గ్రామంలో ఉన్న ఎస్‌బీఐ బ్యాంకులో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి రవినాయక్ మాట్లాడుతూ ఎస్‌బీఐ బ్యాంకు అవసరాల కోసం తక్కెళ్లపాడు, సల్కునూరు, రావులపెంట, ఆదర్శనగర్, కామేపల్లి, మొల్కపట్నం గ్రామాల నుంచి ప్రజలు వందలాది మంది వస్తున్నారని బాత్‌రూం సౌకర్యం లేకపోవడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్పొరేషన్ రుణాలు అందించడంలో, వాటిపై సలహాలు ఇవ్వడంలో బ్యాంకు అధికారులు సహకరించలేదని ఆరోపించారు. ప్రజా పోరులో భాగంగా ప్రజల సమస్యలను తెలుకునే క్రమంలో ఈ సమస్యలు మాదృష్టికి వచ్చాయని తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జిల్లా నగేష్, సైదమ్మ, వెంకటయ్య, అశోక్, శ్రీను, సైదులు, గుంటి శ్రీను, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.


మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం హర్షణీయం


అడవిదేవులపల్లి : బాణసంచా పేల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వడం హర్షనీయమని బీసీ నేత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ అన్నారు. సోమవారం స్థానిక బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసిన శంకర్‌నాయక్‌కు కాంగ్రెస్ అధిష్టానం గుర్తించడం చాలా ఆనందంగా ఉందన్నారు. శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం పార్టీ కోసం పని చేస్తున్న నాయకులను గుర్తించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు తిరుమలగిరి అశోక్, అంజి గౌడ్, సత్యం, నాయిని భాస్కర్, శేఖర్ గౌడ్, శ్రీను, బాలు తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల నాయకులు కూరాకుల చిన రామయ్య ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో బాణసంచా పేల్చుతూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బండి అంజనేయులు, ఆనంద్, హనుమంతు, నారాయణ, అల్లాని కోటయ్య, సైదయ్య, రవి తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అర్జున్

సావిత్రిబాయి పూలే జీవితం స్ఫూర్తిదాయకం


దేవరకొండ : సావిత్రిబాయి పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


మిర్యాలగూడ టౌన్ : బీసీ బాలికల హాస్టల్‌లో ..

హాలియా : సావిత్రిబాయి పూలే జీవితం స్ఫూర్తిదాయకమని పీఆర్‌టీయూటీ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మంద సైదులు అన్నారు. సోమవారం అనుముల మండలం నాయుడుపాలెం గ్రామంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మంద సైదులురావు గౌతమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యడవల్లి సోమ శంకర్ , రమావత్ చెన్నానాయక్, బిచ్చా నాయక్, జాంపా, మహిళా నాయకురాలు చాంది, బాణావత్ రాజీ, భారతీ, లలిత, వల్లి, బూబి, బిచ్చి, దేబారాజి, లక్ష్మి, పార్వతి, సోని, గాడి. జీజాబాయి పాల్గొన్నారు

సావిత్రీబాయిపూలేకు నివాళి

మిర్యాలగూడ టౌన్ : భారతదేశపు మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు, భారతీయ సంఘ సంస్కర్త, కవి, రచయిత సావిత్రీబాయి పూలే వర్ధంతిని మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని గాంధీ పార్కు ప్రాథమిక పాఠశాల, హౌసింగ్‌బోర్డులోని నేతాజీ స్కూల్‌లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీ భవన్‌లో సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


మిర్యాలగూడ టౌన్ : గాంధీపార్క్ పాఠశాలలో..


మిర్యాలగూడ టౌన్ : బీసీ భవనంలో..

దేవరకొండ : సామాజికవేత్త సావిత్రీబాయి పూలే 128వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాస్కరాచారి, అంకం చంద్రమౌళి, కృష్ణాచారి, వరికుప్పల శ్రీను, జయలక్ష్మి, లలిత, పున్న వెంకటేశ్వర్లు, గోపి నాయక్, గోపీనాయక్, తదితరులున్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పగిళ్ల రాము, అంకూరి నరసింహా, నేతాళ్ల వెంకటేశ్, ,ఛండీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


హాలియా : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ మల్లిక


పెద్దదేవులపల్లి : జెడ్పీ హెచ్‌ఎస్‌లో పరీక్ష సామగ్రి అందజేస్తున్న అంబటి రాము

హాలియా : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డాక్టర్ నామాల మల్లిక శేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని హజారిగూడెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దాతలు ముందుకు వచ్చి పాఠశాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దివ్య శ్రీ, జబీన్, జలీల్ బాష, శ్రీదేవి, నామాల విశ్వనాథం, సుబ్బయ్య, కమలమ్మ, పెద్దులమ్మ పాల్గొన్నారు.

భయం లేకుండా పరీక్షలు రాయాలి

త్రిపురారం : పదో తరగతి విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలని పెద్దదేవులపల్లి మాజీ ఎంపీటీసీ అంబటి రాము అన్నారు. సోమవారం మండలంలోని పెద్దదేవుల పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా అంబటి రాము మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. పదవ తరగతిలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి కుమార్, ఉపాధ్యాయులు ఆశారాణి, లక్ష్మయ్య, రామారావు, శేఖర్, వెంకటేశ్వర్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రాలపై దాడులు అరికట్టాలి

దేవరకొండ : బౌద్ధ క్షేత్రాలపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఆలిండియా సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం దేవరకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా గౌతమ బుద్ధుడి బోధనతో శాంతి సమానత్వాన్ని నెలకొల్పే బౌద్ధ ఆలయాలు, బుద్ధిస్టులపై దాడులను ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. బౌద్ధ క్షేత్రాలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యా యనని అన్నారు. ప్రభుత్వం వెంటనే బౌద్ధ క్షేత్రాలపై దాడుల చేసే నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేస్తామని డిమాండ్ చచేశారు. ఈ సమావేశంలో ధర్మపురం, ప్రసాద్, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బుర్రి వెంకన్న

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : ది తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని క్లీయో స్పోర్ట్స్‌లో జరుగుతున్న జిల్లా స్థాయి టీ–20 లీగ్ కమ్ నాకౌట్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కంచర్ల శ్రీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ప్రభాత్ శర్మలు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు కావలి వెంకన్న, రాజు, నిర్వాహకులు నరేందర్, శ్రీకాంత్, నాయుడు, ప్రైజ్, శివకుమార్, శ్రవణ్, మణికంఠ, ధీరజ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

రామగిరి (నల్లగొండ): డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సాధన కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య భవన్ నుంచి నల్లగొండ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, దండెంపల్లి సరోజ, కోట్ల అశోక్ రెడ్డి, గాదె నరసింహ, ఊటుకూరు మధుసూదన్‌రెడ్డి, పాక లింగయ్యలు పాల్గొన్నారు.

డీఎస్పీ శ్రీనివాస్‌కు రంగనాథ్ అభినందన


డీఎస్పీ శ్రీనివాస్‌రావును అభినందిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

మిర్యాలగూడ అర్బన్ : జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ఆనాటి డీఎస్పీ శ్రీనివాసరావును సోమవారం అప్పటి నల్లగొండ ఎస్పీ, ప్రస్తుత హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైదరాబాద్‌లో తన కార్యాలయంలో శాలువతో సత్కరించారు. కేసు నీరుగారకుండా అన్ని రకాల సాక్ష్యాలను కోర్టుకు సమర్పించి త్వరితగతిన శిక్ష పడేలా కృషి చేశారని కితాబిచ్చారు.

ప్రచార కరపత్రం ఆవిష్కరణ

హాలియా : 2025–26 విద్యా సంవత్సరానికి గాను హాలియా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని ప్రధానాచార్యులు డాక్టర్ ఘన్ శ్యామ్ సూచించారు. సోమవారం డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందాలని కరపత్రం విడుదల చేశారు. సాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహాత్మా జ్యోతిరావు పూలే కళాశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాలియా డిగ్రీ కళాశాలలో ఉన్న వసతులు, హాస్టల్ వసతిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యాదగిరి, రాజు ఉన్నారు.